ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :192 గురువారం మే 7 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## మోదీ సభ విజయవంతానికి విస్తృత సన్నాహాలు



- మేధావులతో సమావేశమైన తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్
- మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధానమంత్రి సభ
- తెలంగాణ ప్రజల్లో భారీ ఉత్సాహం కనిపిస్తోందన్న బీజేపీ నేతలు



హైదరాబాద్, మే-06 (మనప్రజాప్రతినిధి): గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించి తెలంగాణ బీజేపీ విస్తృత సన్నాహాలు చేపట్టింది. సభ ఏర్పాట్లలో భాగంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ బుధవారం పలువురు మేధావులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో అభివృద్ధి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ వేదిక కానుందని నేతలు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేందుకు తెలంగాణ ప్రజల్లో విశేషమైన ఉత్సాహం కనిపిస్తోందని ఎన్ రామచందర్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు సభకు హాజరుకానున్నారని వెల్లడించారు. “వికసిత తెలంగాణ” లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువయ్యాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర సహకారం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు విస్తృతంగా పనిచేస్తున్నాయని బీజేపీ నాయకులు తెలిపారు. సభకు భారీ జనసందోహం తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

## నింగి నుంచి పోలీసుల నిఘా

- డ్రోన్ కెమెరాలతో కడప నగరంలో ప్రత్యేక తనిఖీలు
- గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలపై ఉక్కుపాదం
- అసాంఘిక కార్యకలాపాల అరికట్టేందుకు స్పెషల్ పార్టీల దాడులు





కడప, మే-06 (మనప్రజాప్రతినిధి): కడప నగరంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, అసాంఘిక కార్య కలాపాలను అరికట్టేందుకు జిల్లా పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. నగరంలోని అనుమానిత ప్రాంతాలపై అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ పార్టీలతో కలిసి డ్రోన్ సాయంతో పలు ప్రాంతాలను గాలిస్తున్నారు. గంజాయి సేవించే ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా భవనాల పైభాగాలు, ఖాళీ ప్రదేశాలు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు పోలీసులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతోందని పేర్కొన్నారు. నిషేధిత మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ లక్ష్యమని అధికారులు వెల్లడించారు. కడప నగరంలో నేరాల నియంత్రణ కోసం డ్రోన్ నిఘా, ప్రత్యేక దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక సమీక్ష

- గంభీరావుపేటలో ప్రభుత్వ యంత్రాంగానికి కీలక దిశానిర్దేశం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన విస్తృత సమీక్ష
- మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో అభివృద్ధి పనుల పురోగతి విశ్లేషణ
- 99 రోజుల కార్యాచరణలో వేగం పెంచాలని స్పష్టమైన ఆదేశాలు



రాజన్న సిరిసిల్ల, మే 05 (మనప్రజాప్రతినిధి): ప్రజా పాలనప్రగతి ప్రణాళిక “99 రోజుల” కార్యాచరణలో భాగంగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై గంభీరావుపేట మండల కేంద్రంలో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షత వహించగా, ప్రభుత్వ యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డా. కవ్వంపల్లి సత్యనారాయణ కూడా హాజరై జిల్లా అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగం, విద్య, ఆరోగ్య రంగాల్లో చేపడుతున్న పనులపై వివరాలు తెలుసుకున్నారు. పనులు ఎక్కడ ఆలస్యమవుతున్నాయో గుర్తించి వెంటనే వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు సమయానికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపడుతున్న ప్రతి పనికి నిర్దిష్ట గడువు ఉండాలని, ఆ గడువులోపే పూర్తి చేయాలని నేతలు అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రతి మండలం, గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించేలా ఉండాలని తెలిపారు. మొత్తంగా ఈ సమీక్ష సమావేశం ద్వారా జిల్లా అభివృద్ధి పనులకు కొత్త ఉత్సాహం లభించగా, అధికారులు వేగవంతమైన అమలు దిశగా ముందుకు సాగాలని స్పష్టమైన సందేశం అందింది.




## లంచం స్వీకరిస్తూ పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

- ఏసీబీ వలలో శరత్ కుమార్
- రూ.20 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత
- ఎన్‌ఓసీ, ఆస్తి విలువ సర్టిఫికేట్ కోసం డిమాండ్
- ఫిర్యాదుదారులకు టోల్ ఫ్రీ 1064కు కాల్ చేయాలని ఏసీబీ సూచన



రంగారెడ్డి, మే 05 (మనప్రజాప్రతినిధి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. శరత్ కుమార్ లంచం స్వీకరిస్తూ ఏసీబీ అధికారుల చేతిలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ తెలంగాణ అధికారులు ఈ చర్యను చేపట్టారు. వివరాల ప్రకారం, శరత్ కుమార్ మొదట ఫిర్యాదుదారుని నుంచి రూ. 30,000 లంచం డిమాండ్ చేయగా, తరువాత దాన్ని రూ. 20,000కు తగ్గించి స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుని సైట్ వివరాలను ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి, ఎన్‌ఓసీ మరియు ఆస్తి విలువ సర్టిఫికేట్ జారీ చేయడానికి ఈ లంచం తీసుకున్నట్లు వెల్లడించారు. ఏసీబీ అధికారులు నిర్వహించిన ట్రాప్ ఆపరేషన్‌లో శరత్ కుమార్ నుంచి రూ. 20,000 లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే స్పందించాలని ఏసీబీ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అవినీతి నిరోధానికి ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు.



## అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



- ధాన్యం కొనుగోలుపై అత్యవసర సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- అదనపు ట్రక్కులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు
- నర్మెట్ట, తరిగొప్పుల రైతుల కోసం మొక్కజొన్న కేంద్రం ఏర్పాటు

జనగామ, మే-06 (మనప్రజాప్రతినిధి): అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు .అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్, డిఆర్డిఓ, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం కురిసిన అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి వెంటనే మిల్లింగ్‌కు పంపించాలని సూచించారు. ఇప్పటికే ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ట్రక్కు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు ట్రక్కులు పంపించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు.ధాన్యం దిగుమతిలో మిల్లర్లు రైతులకు ఇబ్బందులు కలిగించకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మిల్లును అధికారులు పరిశీలిస్తూ కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి కొనుగోలు కేంద్రంలో అదనపు టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఏఈఓలు ప్రతి రోజు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు.నర్మెట్ట, తరిగొప్పుల మండలాల రైతులకు ఉపయోగపడే విధంగా అనువైన ప్రదేశంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.



కొనుగోలు చేసిన మక్కలను నిర్దేశించిన గోదాంలలో భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిఓ, ఇంచార్జ్ డిఆర్డిఓ, పౌరసరఫరాల డిఎం, మార్కెటింగ్ అధికారులు, ఇంచార్జ్ మార్క్ ఫెడ్ అధికారి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అమెరికాకు పోటీగా చైనా కొత్త ఫైటర్ జెట్.. పాక్‌కు తొలి సరఫరా?




బీజింగ్/ఇస్లామాబాద్, మే 6 (మనప్రజాప్రతినిధి): అంతర్జాతీయ రక్షణ రంగంలో పోటీ మరింత వేడెక్కుతోంది. చైనా తన ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం జే-35ఏఈను ఆవిష్కరించింది. ఈ విమానాన్ని ఎగుమతుల కోసం ప్రత్యేకంగా రూపొందించగా, తొలి సరఫరా పాకిస్థాన్కు జరగొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. అమెరికా తయారు చేసిన ఎఫ్-35 లైట్నింగ్కు పోటీగా ఈ జెట్‌ను చైనా తీసుకొచ్చింది. ఇప్పటికే వినియోగంలో ఉన్న జే-35కు మార్పులు చేసి, అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని జే-35ఏఈ వేరియంట్‌ను రూపొందించింది. మే 1న ఈ విమానాన్ని ప్రపంచానికి పరిచయం చేసినట్లు సమాచారం.ధర పరంగా కూడా పోటీగా ఉండేలా చైనా వ్యూహం రచించింది. జే-35ఏఈ ధర సుమారు 80 మిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. అదే సమయంలో ఎఫ్-35 ధర మోడల్‌ను బట్టి 120 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. తక్కువ ధరతో ఎక్కువ దేశాలను ఆకర్షించాలన్నదే చైనా లక్ష్యంగా కనిపిస్తోంది.ఈ యుద్ధ విమానం ట్విన్ ఇంజిన్‌తో పనిచేస్తూ, అత్యాధునిక రాడార్, ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థలు, స్టెల్త్ టెక్నాలజీ వంటి ప్రత్యేకతలను కలిగి ఉంది. శత్రు రాడార్‌కు చిక్కకుండా ఉండే అంతర్గత ఆయుధ వ్యవస్థ దీనిలో ఉండటం ప్రధాన బలం. చైనా ఇప్పటికే తన వైమానిక దళం, నావికాదళం కోసం జే-35, జే-35ఏ వేరియంట్లను వినియోగిస్తోంది.పాక్ ఇప్పటికే 2024లోనే ఈ విమానాల కొనుగోలుపై ఆసక్తి చూపింది. సుమారు 40 జెట్లను కొనుగోలు చేసే ప్రణాళికపై చర్చలు జరిగాయని సమాచారం. పైలట్లకు శిక్షణ కూడా ప్రారంభమైనట్లు అప్పట్లో నివేదికలు వెల్లడించాయి. రెండేళ్లలో సరఫరా పూర్తయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ పరిణామం దక్షిణాసియా ప్రాంతంలో రక్షణ సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అవిలాల గంగజాతరలో ఎమ్మెల్యే పులివర్తి నాని సందడి

- అంగరంగ వైభవంగా నిర్వహించిన గంగమ్మ జాతర
- డప్పులు, బాణాసంచాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం
- గంగమ్మ తల్లికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు



తిరుపతి, మే-06 (మనప్రజాప్రతినిధి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. పంచాయతీ నాయకులు, గ్రామ పెద్దల ప్రత్యేక ఆహ్వానం మేరకు



చంద్రమగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జాతరకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు డప్పులు, వాయిద్యాలు, బాణాసంచాల మోతతో ఘన స్వాగతం పలికారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కళకళలాడింది. అనంతరం గ్రామదేవత గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే పులివర్తి నాని సారె సమర్పించారు. జాతర ముక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.జాతరలో పాల్గొన్న భక్తులను, ప్రజలను ఎమ్మెల్యే పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. జాతర సందర్భంగా భక్తుల రద్దీతో అవిలాల గ్రామం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గంగమ్మ జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ... ఓటమి వేళ సంఘీభావం



-అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ
-కష్టకాలంలో అండగా ఉంటానని స్టాలిన్‌కు హామీ ఇచ్చిన రజనీ
-108 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ పార్టీ టీవీకే

చెన్నై, మే 6 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాలు హీట్ ఎక్కాయి. ఈ నేపథ్యంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ను సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇవాళ చెన్నైలోని ఆయన నివాసంలో కలిశారు. డీఎంకే ఓటమి అనంతరం జరిగిన ఈ భేటీకి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది.ఎన్నికల్లో ఎదురైన పరాజయం నేపథ్యంలో స్టాలిన్‌కు సంఘీభావం తెలపడానికి రజనీకాంత్ ఈ సమావేశం నిర్వహించినట్లు సమాచారం. కష్టకాలంలో తాను అండగా ఉంటానని స్టాలిన్‌కు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కొంతసేపు కొనసాగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో డీఎంకే మిత్రపక్షాలైన వీసీకే, వామపక్ష నేతలు కూడా పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో స్టాలిన్‌ను కలిసి మద్దతు ప్రకటించారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో 234 స్థానాల్లో డీఎంకే కేవలం 59 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. మరోవైపు నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన పూర్తి మెజారిటీకి కొద్దిగా దూరంలో నిలిచింది.దీంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు కోసం ప్రయత్నాలు వేగవంతం చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీల మద్దతు కోరుతూ చర్చలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ చెన్నైకి చేరుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠను మరింత పెంచింది.ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తమిళనాడులో సంకీర్ణ రాజకీయాలకు నాంది పలికే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



## గవర్నర్‌ను కలిసిన టీవీకే అధినేత విజయ్..

-లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన విజయ్
-ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ ఆహ్వానం నేపథ్యంలో కలిసిన విజయ్
-నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు



చెన్నై, మే 6 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీవీకే పార్టీ అధినేత, ప్రముఖ నటుడు విజయ్ చెన్నైలోని లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ను కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ కార్యాలయం ఆహ్వానం పంపింది.ఈ నేపథ్యంలో విజయ్ తనకు తగిన మెజారిటీ ఉందని నిరూపించేందుకు మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల జాబితాతో కూడిన లేఖను గవర్నర్‌కు సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియలో ఇది కీలక దశగా భావిస్తున్నారు.ఇదిలా ఉండగా, చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్ కూటమి పోటీ చేసినప్పటికీ, టీవీకేకు పూర్తి మెజారిటీకి కొద్దిగా తక్కువ స్థానాలు రావడంతో కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమవుతోంది.

# ప్రపంచ వేదికపై మోదీ దౌత్య వ్యూహం

**-వియత్నాంతో సంబంధాల బలోపేతానికి కీలక నిర్ణయాలు**
**-వాణిజ్యం, భద్రత రంగాల్లో భారత్ కొత్త లక్ష్యాలు**
**-ప్రపంచ ఉద్రిక్త పరిస్థితులపై ప్రధాని స్పందన**



న్యూఢిల్లీ, మే-06 (మనప్రజాప్రతినిధి): ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న సమయంలో భారత్ తన దౌత్య వ్యూహాలను మరింత బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా ఆసియా ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా వియత్నాంతో సంబంధాలను మరింత విస్తరించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌తో సమావేశం అనంతరం చేసిన ప్రకటనలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంత రించు కున్నాయి. భారత్, వియత్నాం మధ్య వాణిజ్యాన్ని 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు వేగంగా పెరుగుతున్నాయని, రానున్న సంవత్సరాల్లో మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, ఇంధనం, సముద్ర వాణిజ్యం, రక్షణ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత అత్యంత కీలకమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సముద్ర మార్గాల స్వేచ్ఛ, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ విషయంలో భారత్ తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని చెప్పారు. ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే సముద్ర మార్గాల భద్రత కోసం భారత్, వియత్నాం కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రకటనకు అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు అరుదైన ఖనిజ వనరుల రంగంలో సహకారం పెంచేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, సాంకేతిక పరిశ్రమలకు కీలకంగా మారనున్న ఈ ఖనిజాల విషయంలో భారత్ దీర్ఘకాల వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంలో వియత్నాం కీలక భాగస్వామిగా మారే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా ప్రధాని మోదీ స్పందించారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పౌరులు, మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. అమాయక ప్రజలపై దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కావని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి యుద్ధం కాకుండా సంభాషణ, దౌత్య మార్గాలే సరైనవని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలు శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ ఎప్పటికీ శాంతి, అభివృద్ధి, సహకారానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. ఇదిలావుండగా భారత్ అంతర్జాతీయ వేదికపై తన ప్రభావాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో సంబంధాలను బలోపేతం చేస్తూ ఆసియా ప్రాంతంలో వ్యూహాత్మక సమతౌల్యాన్ని కాపాడాలని భారత్ ప్రయత్నిస్తోందని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చిత పరిస్థితుల్లో ఉండగా కొత్త వాణిజ్య భాగస్వామ్యాలు, సరఫరా వ్యవస్థల బలోపేతం అత్యంత అవసరమైందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వియత్నాంతో భారత్ కుదుర్చుకుంటున్న భాగస్వామ్యం భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. ప్రధాని మోదీ తాజా ప్రకటనలతో భారత్ అంతర్జాతీయ దౌత్యంలో మరింత చురుకైన పాత్ర పోషించబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు వేగంగా మారుతున్న సమయంలో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటూనే ప్రపంచ స్థిరత్వానికి సహకరించే దిశగా ముందుకు సాగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రాయపోల్ మండలంలో... పంటల పాడైపోవడంతో రైతుల ఆర్తనాదం





మనప్రజాప్రతినిధి//రాయపోల్ మే 06):సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలు నేలకొరిగి రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. పండిన పంటలు కళ్లముందే నాశనం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాయపోల్ మండలంలోని రాయపోల్ గ్రామానికి చెందిన రైతు చింతకింది మంజూరు మాట్లాడుతూ, “మా పంట పూర్తిగా దెబ్బతింది. పెట్టిన ఖర్చు కూడా తిరిగి రావడం లేదు. కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది” అని వాపోయారు.ఈ ఘటనతో మండలంలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నారని స్థానికులు చెబుతున్నారు. వెంటనే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి, తగిన నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటివరకు అధికారులు సరైన స్పందన ఇవ్వలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

# రాయపోల్ మండలంలో నడిరోడ్డుపై పడిన చెట్లు అధికారుల నిర్లక్ష్యంపై వాహనదారుల ఆగ్రహం



మనప్రజాప్రతినిధి//రాయపోల్ మే 06):సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్ర పరిధిలో గజ్వేల్ నుండి తిమ్మక్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకర పరిస్థితి నెలకొంది. నిన్న రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి రహదారి పక్కన ఉన్న చెట్లు వేరుతో సహా కూలి నడిరోడ్డుపై పడిపోయాయి. ఈ ఘటన ఇండియన్ బ్యాంక్ సమీపంలో సుమారు 100 మీటర్ల దూరంలో చోటుచేసుకుంది.ఈ ఉదయం సుమారు 10 గంటల సమయానికి కూడా చెట్లు తొలగించకపోవడంతో రహదారిపై రాకపోకలు తీవ్రంగా అంతరాయం కలిగించాయి. వాహనదారులు ఇబ్బందులు పడటంతో పాటు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికులు, వాహనదారులు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే స్పందించి రహదారిని శుభ్రం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా చెట్లను తొలగించి ప్రజల భద్రతను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పేదల కోసమే ప్రజా ప్రభుత్వం





మనప్రజాప్రతినిధి// దినపత్రిక,దూల్మిట్ట, జనగామ:జనగామ నియోజక వర్గం. దూళిమిట్ట మండలం కేంద్రలో,కల్లు గీత సామాజిక వర్గ కుటుంబానికి చెందిన నాచగోని లక్ష్మి, నరహరి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా చికిత్సకు డబ్బులు అవసరం కాగా,విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్,వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా,తక్షణం స్పందించి(2,00,000)రెండు లక్షల రూపాయల ఎల్ఓసి,ద్వారా మంజూరు చేయించడం జరిగింది.ఇట్టి మంజూరు పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ బాధిత కుటుంబానికి వారి గ్రామంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లీలా జగన్మోహన్ రెడ్డి,మాజీ సర్పంచ్ సుద్దాల నరసింహులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి లక్ష్మారెడ్డి,చెప్యాల ఐలయ్య,గొల్లపల్లి రమేష్,చిన్నోజు రాజు,పాలడుగుల రాకేష్,తుషాలపురం బాబు,కునబోయిన రవి,నాచగోని రాములు,నాచగోనివెంకట్,నాచగోని సురేష్,కునబోయిన మల్లయ్య,వట్టే కనకయ్య,కోల రాజు,తాళ్లపల్లి సత్తయ్య,లింగాల ఆనందం,సుద్దాల బిక్షపతి,రచ్చ బుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంగ్రామ సభకు కదిలిన బిఆర్ఎస్ సైన్యం...



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, బచ్చన్న పేట, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం .వరంగల్ పట్టణంలో బుధవారం జరగనున్న రైతు సంగ్రామ సభను విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆదేశానుసారం సర్పంచుల ఫోరం మండలం మాజీ అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి,చల్ల శ్రీనివాసరెడ్డి, ఈదులకంటి ప్రతాప్ రెడ్డి,ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు కదిలి వెళ్లారు.వాహనాల ముందు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి బిఆర్ఎస్ సైనికులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యం,కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తామని,రైతుల పంటలను కొనుగోలు చేయడంలో సర్కారు విఫలమవ్వడం,యాసంగి రైతు భరోసా ఇప్పటికీ పూర్తిగా అందించకపోవడం,రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయకపోవడం,యూరియా యాప్‌తో రైతులు పడుతున్న ఇబ్బందులు,కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద కొనుగోలు చేయక రైతులను అరిగోసపెడుతున్న ప్రభుత్వంపై పోరాటం,ఇంకా రైతుల సమస్యలపై జరుగుతున్న ఈ సభకు మండలం నుండి రైతులు బిఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లడం జరిగింది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎండి ఫిరోజ్,ఆరే రవి, నాయకులు మూసిని రాజు,ఎండి అజీమ్, హరి ప్రసాద్,ఉపసర్పంచ్ చింతల రాజు,బందారం వినయ్,కుమారస్వామి,తిరుమల్ రెడ్డి,నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# సిగ్గు శరం లేకుండా అలాయ్ బలాయ్ చేసుకుంటారా?

-మంత్రిని నేరుగా అడుగుతున్నా..మీకు ఏమైనా సిగ్గు శరం ఉందా?
-డేబై లక్షల రైతులకు డేబైరెండు వేల కోట్లు ఇచ్చింది బీఆర్ఎస్...
-మేము రైతు సదస్సు పెడితే కాంగ్రెస్ బయపడుతుంది.
-రెండున్నరేళ్లలో సుమారు వేయి మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారు.
-ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన రైతు హత్యలే.రైతులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరైన సభ ఇదే వరంగల్ రైతు సంగ్రామ సదస్సు.కాంగ్రెస్
-పాలనలో దేవాదుల నీళ్లు కేవలం నలబై ఏడు వేల ఎకరాలకు మాత్రమే ఇచ్చింది.
బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక దేవాదుల ద్వారా మూడు లక్షల నలబై ఏడు వేల
-ఎకరాలకు సాగునీరు అందించింది.వరంగల్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం పై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫైర్



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,జనగామ:జనగామ నియోజకవర్గం.ఓరుగల్లులో బుధవారం నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సుకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సదస్సుకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,అధ్యక్షత వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,మేము రైతు సదస్సు పెడితే కాంగ్రెస్ రైతు మేళా పెడతామంటోంది.రైతులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరైన సభ ఇదే వరంగల్ రైతు సంగ్రామ సదస్సు.గత రెండున్నరేళ్లలో సుమారు వేయి మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన రైతు హత్యలే.తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన పవిత్ర గడ్డ వరంగల్.రైతు ఉద్యమ స్ఫూర్తి ఇక్కడి నుంచే ప్రారంభమైంది.బీఆర్ఎస్ సభలు పెడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతోంది.ప్రజల మద్దతు ఎవరి వైపు ఉందో కాంగ్రెస్‌కు స్పష్టంగా తెలుసు.కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెట్టగానే,అదే రోజు అదే సమయానికి రేవంత్ రెడ్డి సభ పెట్టారు.కేసీఆర్ మీటింగ్‌కు నలబై లక్షల మంది వస్తే, కాంగ్రెస్ వాళ్ల మీటింగ్‌కు నాలుగు లక్షల మంది వచ్చారు.రేవంత్ సభ పూర్తిగా ఫ్లాప్ అయింది.మెడిగడ్డ మీటింగ్‌లో ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి మంత్రులు సీఎంతో అలాయ్ బలాయ్ చేసుకుంటున్నారు.ఒక్క ఎకరానికి ఆరు వేల రూపాయలు ఇచ్చి సిగ్గు శరం లేకుండా అలాయ్ బలాయ్ చేసుకుంటావా?మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుడ నీకు ఏమైనా సిగ్గు శరం ఉందని నేను అడుగుతున్నా?2014 నుంచి 2023 వరకు కేసీఆర్ డేబై లక్షల మంది రైతులకు పదకొండు విడతల్లో డేబై రెండు వేల కోట్ల రూపాయలు నేరుగా అందించారు.2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో దేవాదుల నీళ్లు కేవలం నలబై ఏడు వేల ఎకరాలకు మాత్రమే ఇచ్చారు.కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక 2014 తరువాత పది హేను వందల కోట్లు ఇచ్చి,ప్రపంచంలోనే అత్యంత పెద్ద టన్నెల్‌ను రామప్ప నుంచి ఉనికి చర్ల వరకు తవ్వించి,ధర్మసాగర్ వద్ద మూడు భారీ మోటార్లు ఏర్పాటు చేశారు.సమ్మక్క సాగర్‌ను తుపాకుల గూడెం దగ్గర నిర్మించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక దేవాదుల ద్వారా మూడు లక్షల నలబై ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందించారు.ఈ ప్రభుత్వం అదనంగా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు.తట్టెడు మట్టి తీయలేదుడ జానెడు కాలువ తీయలేదు.మీకు సిగ్గు శరం ఉంటే, రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే రెండు వేల కోట్లు ఇచ్చి దేవాదుల పూర్తి చేయండి.2014కు ముందు కాకతీయ కాలువ హుజురాబాద్ దాటలేదు.నేడు కాకతీయ కాలువకు వెయి కోట్లు కేటాయించి చివరి భూముల వరకు నీళ్లు అందించారు.డోర్నకల్, మహబూబాబాద్, భూపాలపల్లి, నర్సంపేట వరకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ దే.చెరువుల పునరుద్ధరణ,చెక్‌డ్యామ్‌లు,కొత్త విద్యుత్ కనెక్షన్లతో వరంగల్ జిల్లాను సస్యశ్యామలంగా మార్చారు.వరంగల్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో డేబై నుండి ఎనబై శాతం ప్రాంతం సాగుభూమిగా మారింది.మొత్తంగా వరంగల్ జిల్లాను సస్యశ్యామలంగా మార్చిన ఘనత కేసీఆర్ దే.సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయాన్ని బలోపేతం చేశారు.నీళ్ల కోసం రైతు కన్నీరు పెట్టాల్సిన పరిస్థితి లేకుండా చేశారు.రైతు గుండెల్లో నిలిచింది బీఆర్ఎస్ మాత్రమే.మీటింగ్ అంటే జాగా ఇవ్వరు! ఒక్క పైసా ఇవ్వనన్న కిరణ్ కుమార్ రెడ్డికి ఏ గతి పట్టిందో చూశాం.ఈ గడ్డ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదిన గడ్డ.నీ బాస్‌లు,వాళ్ల బాస్‌ల మెడలు వంచి తెలంగాణ రావడానికి ఊపిరి బాదిన గడ్డ ఈ వరంగల్.కాకతీయుల ప్రతాప స్ఫూర్తిగా పోరాటం చేస్తాం.రాణి రుద్రమదేవి పౌరుషం గల వాళ్లం.సమ్మక్క సారలమ్మ పోరాట స్ఫూర్తిగా కొట్లాడుతాం.ఈ గడ్డ మట్టి మాణిక్యాలు దొడ్డి కొమురయ్య,చాకలి ఐలమ్మ,సర్దార్ పాపన్నల స్ఫూర్తితో కొట్లాడుదాం.మా జయశంకర్,కాళోజి కవితా గానం సాక్షిగా, పాతాల సాక్షిగా కొట్లాడుదాం.మీ మెడలు వంచుతాండమా రైతన్నలకు ఇచ్చిన హామీలను సాధిస్తాం.వరంగల్ రైతన్నలకు పోరాటానికి రామన్న తోడు అయితే, బీఆర్ఎస్ తోడై,మీ భరతం పడుతాం.

## రైతు సంగ్రామ సదస్సుకు భారీగా తరలివెళ్లిన చేర్యాల బీఆర్ఎస్ నాయకులు




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం .రైతు సమస్యలపై గళమెత్తే సమయం ఆసన్నమైందని, నేడు హనుమకొండలోని హంటర్ రోడ్డులో నిర్వహించనున్న 'రైతు సంగ్రామ సదస్సు'ను విజయవంతం చేయడానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి ఆదేశాల మేరకు చేర్యాల పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు,రైతులు తరలి వెళ్లారు.ఈ సందర్భంగా ముస్త్యాల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి,హామీల అమలులో పూర్తిగా వైపల్యం చెందిందని విమర్శించారు.రైతు భరోసా,రుణమాఫీ,బోనస్, ధాన్యం కొనుగోలు వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు.రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి యూరియా కొరత, విద్యుత్ అంతరాయాలు, సాగునీటి సమస్యలు అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం.ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్,అన్ని వర్గాలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసేవారని,ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సభకు తరలి వెళ్లిన నాయకులు మున్సిపల్ చైర్మన్ ముస్త్యాల అరుణ బాల నరసయ్య,వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ కౌన్సిలర్లు సుప్రజా రాజీవ్ రెడ్డి,వీరబత్తిని సదానందం,కమలాపురం గీతాంజలి,భూనాద్రి సురేష్,ఎండి.ఇజాజ్, సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి,పూర్మ వెంకటరెడ్డి,టౌన్ సెక్రెటరీ బూరగోని తిరుపతి గౌడ్,యూత్ ఇన్చార్జి శివ గారి అంజయ్య,నాయకులు మంచాల కొండయ్య,చింతల పరశురాములు,ఇతర నాయకులు,కార్యకర్తలు,భారీగా తరలి వెళ్లారు.

## నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలి



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 06 మే :ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బిజెపి పార్టీ ఆఫీసులో ఇల్లంతకుంట మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10 వ తేదీన సికింద్రాబాద్ పరెడ్ గ్రౌండ్ లో భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ భారీ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.బిజెపి పార్టీ 20 బస్సుల లో సభకు తరలి వెళ్తున్నట్లు తెలియ జేశారు. ఇల్లంతకుంట మండలంలో అన్ని గ్రామాల నుండి ప్రజలు బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చేలా నాయకులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కూనబోయిన బాలరాజు, పండగ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పినికాశి అనిల్, కరికె నవీన్ కుమార్, కార్యదర్శి లంకోజ్ చంద్రం, కోశాధికారి పిల్లి గోపాల్, కార్యవర్గ సభ్యులు తుమ్మనపల్లి కమలాకర్ రావు, చక్రాల కార్తీక్, ఓరం భార్గవ్ రెడ్డి, నాయకులు కూనవేని రాజు, మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు వేదిక లో వ్యవసాయ వారోత్సవాలు



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 06:ప్రజా పాలనలో – ప్రగతి ప్రణాళికలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా చేగుంట వ్యవసాయ రైతు వేదికలో మార్కెట్ కమిటీ చైర్మన్ తాడెం వెంగళరావు అధ్యక్షతన అధ్వర్యంలో ఘనంగా రైతు వారోత్సవాలు నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు, బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్ప కాలిక పంట రుణాలు పైన రైతులకు అవగాహన కల్పించారు. రైతు శ్రేయస్సుకోసం రైతు సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శివప్రసాద్, ఎంపీడీఓ చిన్నారెడ్డి,అగ్రికల్చర్ ,డిసిసిబీ బ్యాంక్ మేనేజర్ శశికాంత్ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్,వ్యవసాయ సైంటిస్ట్ డాక్టర్ రామాంజనేయులు మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, మొహమ్మద్ ముజామిల్, అన్నం ఆంజనేయులు, స్టాలిన్ నర్సిములు, బాలిరెడ్డి, కాషాబోయిన శ్రీనివాస్, రఫీ, కుర్మ లక్ష్మి, లక్ష్మణ్ సెట్, రమేష్ సెట్, వివిధ గ్రామాల సర్పంచ్ లు ,క్లస్టర్ వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కే. హైమావతి




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. బుదవారం చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ,చేర్యాల మండలం వేచరేణి గ్రామం,కొమురవెల్లి మండల కేంద్రంలోని వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనికి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ లో మక్కలు,వరి ఒకే సారి మార్కెట్ వస్తుందని చేర్యాల చుట్టుపక్కల నుండి కాకుండా జనగాం జిల్లా బచ్చన్నపేట,నర్మేట మండలాల నుండి మక్కలు,వ్యవసాయ మార్కెట్ కమిటీ– చేర్యాల కు వస్తుందని అందుకే కొనుగోలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని మూడు రోజుల్లో అన్ని ఇబ్బందులు తొలగిపోతాయని అప్పటి వరకూ రైతులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.వరి ధాన్యాన్ని మీకు దగ్గరలోని గ్రామాల సెంటర్ లో అమ్ముకోవాలని సూచించారు.సెంటర్ లో గన్నీలు,హమాలీ, కంతాల,లారీల కొరత లేకుండా కొనుగోలు సజావుగా జరపాలని ఏ ఏం సి చైర్మన్ మరియు సిబ్బందిని ఆదేశించారు.వేచరేణి గ్రామంలో ఎక్కువ మొత్తంలో ధాన్యం ఉందని లారీల కొరత ఉందని రైతులు తెలపగా లారీలలో కాకుండా అందుబాటులో ఉన్న ట్రాక్టర్,ఇతర వాహనాలలో నింపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.గతంలో ట్రాక్టర్ లలో ధాన్యం తరలించిన డబ్బులు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా డిఏం సివిల్ సప్లై ఫోన్ లో మాట్లాడి ఎందుకు రాలేదని ఆరా తీసి తప్పకుండా డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.తేమ శాతం వచ్చి తాలు తిస్తేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని, సెంటర్ లో అన్ని సౌకర్యాలు ఉండాలని పాడి క్లీనర్,కంతాల రిపేర్లు చేయించుకోవాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని,కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ శివప్రసాద్




మనప్రజాప్రతినిధి అక్బర్ పేట్ భూంపల్లి మండల్: తమ పాస్వర్డ్ పోయినది ఏవరికైనా దొరికినచో ఇవ్వగలరని కోరుచున్నాను. జిల్లా నియోజకవర్గంతో పాటు మండల ప్రజలకు తెలియజెయునది. ఏమనగా మా యొక్క ఊరు మోతె గ్రామం నా యొక్క పెరు కుంట నగేష్. అనే వ్యక్తి మోతే నుండి. అక్బర్ పేట భూంపల్లి. వస్తూ ఉండగా తన పాస్పోర్ట్ పోయింది. దొరుకుతే ఇవ్వగలరు. వారికి తనకు తోచినంత. ఆర్థిక సాయం చేయగలుగుతానని తెలిపారు. తమకు అది ఎంతో అవసరం ఉంది కాబట్టి తప్పనిసరిగా ఇవ్వగలరు. నాయొక్క ఫోన్ నంబర్ 91779 48415, కు ఫోన్ చేయగలరు.

# పాస్పోర్ట్ పోయినది ఏవరికైనా దొరికితే ... ఇచ్చిన వారికి పారితోషకం ఇవ్వగలం






మనప్రజాప్రతినిధి అక్బర్ పేట్ భూంపల్లి మండల్: తమ పాస్వర్డ్ పోయినది ఏవరికైనా దొరికినచో ఇవ్వగలరని కోరుచున్నాను. జిల్లా నియోజకవర్గంతో పాటు మండల ప్రజలకు తెలియ జెయునది. ఏమనగా మా యొక్క ఊరు మోతె గ్రామం నా యొక్క పెరు కుంట నగేష్. అనే వ్యక్తి మోతే నుండి. అక్బర్ పేట భూంపల్లి. వస్తూ ఉండగా తన పాస్పోర్ట్ పోయింది. దొరుకుతే ఇవ్వగలరు. వారికి తనకు తోచినంత. ఆర్థిక సాయం చేయగలుగుతానని తెలిపారు. తమకు అది ఎంతో ఆవసరం ఉంది కాబట్టి తప్పనిసరిగా ఇవ్వగలరు. నాయోక్క ఫోన్ నంబర్ 91779 48415, కు ఫోన్ చేయగలరు.

# రేయిలింగ్ గోడ కూలి ఆటో, బైక్ ధ్వంసం





మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 06, :చేగుంట మండలం కర్నాల్ పల్లిలో గత రాత్రి వీచిన ఈదురు గాలులకు రెయిలింగ్ గోడ కూలి, కింద ఉన్న ఆటో, బైక్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. బాధితుడు కట్ల స్వామి కుమార్,అప్పు చేసి ఆటో కొనుక్కుని జీవనం సాగి స్తుండగా, ఈ ప్రమాదంతో ఉపాధి కోల్పోయాడు.అకాల వర్షాలతో ఇప్పటికే పంట నష్టపోయిన తనకు, ఇప్పుడు ఆటో కూడా పాడవడంతో భారీ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నాడు.

# రుణాలపై అవగాహానా సదస్సు

మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్: కొండపాక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రజపాలన -ప్రగతి ప్రణాళికి వారోత్సవలలో భాగంగా కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు,కోఆపర్టీవ్ బ్యాంకు సంస్థలతో రైతులకు సంభదించిన సబ్సిడీ లోన్స్, మార్టిగేజ్ లోన్స్,క్రాప్ లోన్స్ గురించి రైతులతో చర్చించి,రైతులందరు లోన్లను సాద్వినియోగించు కోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యంఎ ఓ శివరామకృష, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,డైరెక్టర్లు, సర్పంచులు రైతులు,మండల పార్టీ అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాన్ని దత్తత తీసుకున్న బాల వికాస




మన ప్రజాప్రతినిధి కొండపాక మండల్:వెంకటాపూర్ గ్రామాన్ని బాల వికాస ఆధ్వర్యంలో దత్తత తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని,బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ మేనేజర్ మంజుల అన్నారు. బుధవారం రోజు గ్రామ సర్పంచ్ దబ్బెరా భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ బాలవికాస ఆధ్వర్యంలో నలభై సంవత్సరాలుగా తెలంగాణ,ఇతర రాష్ట్రాలలో గ్రామీణ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు లబ్ధిని చేకూరుస్తుందని అన్నారు. గ్రామాల అభివృద్ధి ఒకరితో సాధ్యం కాదని గ్రామంలోని ప్రజలందరి సహకారంతో గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.పిటీ వెంకటాపూర్ గ్రామం ఆదర్శంగా నిలవాలంటే నాయకులు అందరూ పార్టీలకు అతీతంగా కులమత బేధాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేస్తే గ్రామం అభివృద్ధి చెందుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం బాలవికాస దత్తత తీసుకున్నందుకు సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో బాలవికాస సంస్థ ప్రతినిధులు, గ్రామ సర్పంచ్,గ్రామ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష




**-బాధితురాలికి రూ.2 లక్షల విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు**

**-మెదక్ ఎస్ పి,డి వి శ్రీనివాస రావు**

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 6:మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో 2019 లో మతిస్థిమితం లేని మైనర్ బాలికపై జరిగిన అమానుష లైంగిక దాడి కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు వెలువరించిన తీర్పు సమాజానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. నిందితుడు అర్కెల నాగేశ్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించడంతో పాటు, బాధితురాలి మానసిక వేదన, పునరావాసం దృష్ట్యా రూ.2,00,000 విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మైనర్ బాలికపై జరిగిన దారుణం అత్యంత విషాదకరమని, ఆమె మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో గర్భవతి అయినా విషయాన్ని కూడా గుర్తించలేకపోవడం సమాజాన్ని కలచి వేస్తుందని ఎస్పీ అన్నారు. ఆరు నెలల తర్వాత విషయం వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసి, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుతం బాధితురాలికి 7 సంవత్సరాల వయస్సు గల కుమారుడు ఉన్నాడని తెలిపారు. దాదాపు ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో ప్రజా అభియోగాధికారి బాలయ్య సమర్థంగా వాదనలు వినిపించడం, భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ స్వేత గారు బాధితురాలికి మానసిక ధైర్యం నింపి, ఆమె సాక్ష్యం చెప్పడనికి సిద్ధం చేసి కేసు విజయంలో కీలకమయ్యాయని అన్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె.సుభాష్ , దర్యాప్తు అధికారి డీఎస్పీ కిరణ్, లైజనింగ్ అధికారులు ఎసై విఠల్, కృష్ణ, కోర్టు సీడీఓ నాగరాజు అందరి కృషి అభినందనీయమని ఎస్పీ తెలిపారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం అత్యంత కఠినమైందని, ఇటువంటి నేరాలకు పాల్పడేవారికి తప్పనిసరిగా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. న్యాయం ఆలస్యమైనా తప్పక జరుగుతుందనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంగా ఇస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితురాలి ధైర్యం, అధికారుల నిబద్ధత, న్యాయవ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు కలిసొచ్చినప్పుడు నేరాలకు తావుండదని అన్నారు. చిన్నారి భవిష్యత్తు కాపాడటం మనందరి బాధ్యత అని పునరుద్ఘాటించారు.

